పత్రికాప్రకటన కాకినాడ జూన్ 21, 2019.

**కౌలు రైతులను ఆదుకోవాలి.**
**కౌలు రైతుల పై కామన్ డాక్యుమెంట్ త్వరలో సిద్ధం.**
**జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి**
**పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రి పినిపే విశ్వరూప్**

రాష్ట్రంలో కౌలు రైతులను అన్ని విధాల ఆదుకోవడానికి బ్యాంకర్లు ముందుకురావాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు రెవెన్యూ శాఖా మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ సూచించారు. శుక్రవారంనాడు కాకినాడ కలక్టరేట్ లో జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్షా సమావేశంలో రాష్ట్రంలో 45 లక్షల మంది కౌలు రైతులు వున్నారని, వీరు వివిధ కారణాల మూలంగా ఇన్‌పుట్ సబ్సిడి మరియు ప్రకృతి వైపరిత్యాల సమయంలో సరైన ఆదరణ పొందలేక పోతున్నారని, ఈ పరిస్థితులను అధిగమించి, వీరిని ఆదుకునేందుకు అవసరమైన విధి విధానాలు రూపొందించాలని మంత్రి సూచించారు. అదే విధంగా రాష్ట్రంలోని స్వయంశక్తి సంఘాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంశక్తి సంఘాలకు ఉన్న రుణా బకాయిలను నాల్గు విడతల్లో మాఫీ చేయడానికి నిర్ణయం తీసుకున్నారని అన్నారు. అదే విధంగా రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాల సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కీ క్యాష్ క్రెడిట్ పద్ధతిలో రుణ సదుపాయం కల్పించాలని అన్నారు. చేనేత సహకార సంఘాలకు చెల్లించవలసిన బకాయిలు మరియు ఉత్పత్తుల అమ్మకాలు జరగడానికి బ్యాంకులు వారికి సహకరించాలని, ఈ మేరకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కూడా ఆయన సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి అని, కౌలు రైతులకు అన్ని విధాల సహాయం చేయడానికి అవసరమైన చర్యలు చేపడుతుందని అన్నారు. దీనిలో భాగంగా కౌలు రైతులు, యాజమానుల ప్రయోజనాలు కాపాడే విధంగా వచ్చే పదిరోజుల్లో ఒక ప్రత్యేక డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తుందని అన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతులకు పెట్టుబడి సహాయం రూ. 12,500 లు వచ్చే అక్టోబరు నుండి చెల్లించడానికి చర్యలు చేపాడుతున్నారని అన్నారు. రాష్ట్రంలోని వివిధ కార్పోరేషన్ల ద్వారా ఎస్.సి, ఎస్.టి., బిసిలకు అందించే ఆర్థిక సహాయం పూర్తిస్థాయిలో వుండాలని మంత్రి బ్యాంకర్లకు సూచించారు. అదే విధంగా లక్ష్యాల మేర రుణ సౌకర్యం కల్పించాలని కూడా మంత్రి సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ దాడిశెట్టి రాజా మాట్లాడుతూ తుని నియోజకవర్గానికి గొర్రెలు, మేకలు కోసం పైలట్ ప్రాజెక్టుగా 3,400 యూనిట్లు మంజూరు చేసారని, దీని కోసం లబ్దిదారుని వాటాగా రూ.40,000 చొప్పున చెల్లించారని అన్నారు. వీటిలో 600 యూనిట్లు మాత్రమే గ్రౌండింగ్ జరిగిందని, మిగిలిన యూనిట్లు వెంటనే గ్రౌండింగ్ చేయాలని కోరారు. దీనిపై పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు వివరణ ఇస్తూ ఎన్నికల మూలంగా ఈ యూనిట్లు గ్రౌండింగ్ పూర్తి స్థాయిలో జరగాలేదని, త్వరలో ఈ యూనిట్లు గ్రౌండింగ్ చేస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నవరత్నాలు కార్యక్రమాలపై త్వరలో విధి విధానాలు రానున్నాయని జిల్లాలో వ్యవసాయ సీజన్ మొదలైవున్నందున రైతులకు రుణాలు అందించేందుకు చర్యలుచేపడుతున్నామని అన్నారు. రైతులకు 1.60 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించడానికి కొల్లేట్రల్ ష్యూరిటీ అవసరం లేదని అన్నారు. జిల్లాలో పలు రుణాలు రైతులకు విస్తృత స్థాయిలో అందించేందుకు చర్యలు చేపడుతున్నామని కలక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్.ఎల్.సి సోమువీర్రాజు మాట్లాడుతూ మంజూరైన యూనిట్లు అన్ని పూర్తి స్థాయిలో గ్రౌండింగ్ జరగాలని, ముద్ర రుణాలను లబ్దిదారులకు నిరంతరంగా అందజేయాలని అన్నారు. మరో ఎమ్ఎల్‌సి రత్నాబాయి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో బ్యాంకుల ద్వారా గిరిజనులకు రుణ సౌకర్యం కల్పించాడానికి చర్యలు చేపట్టాలని, ఈ మేరకు రంపచోడవరం ఐటిడిఎ ల సమావేశాలు ఏర్పాటు చేయాలని అన్నారు. శాసన మండలి సభ్యులు చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ పంట రుణాలను పూర్తి స్థాయిలో రైతులకు అందజేయాలని అన్నారు. ప్రత్తిపాడు శాసన సభ్యులు పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో డి.సి.సి.బి. బ్యాంకు ద్వారా అందజేసిన కాపు కార్పొరేషన్ రుణాల గ్రౌండింగ్ పై దర్యాప్తు చేయాలని కోరారు. రాజోలు శాసన సభ్యులు రాపాక వరప్రసాదరావు బ్యాంకు రుణాల మంజూరులో జాప్యం మూలంగా లబ్దిదారులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, అదే విధంగా రైతులకు రుణ సౌకర్యం కల్పించడానికి బ్యాంకులు సహకరించాలని అన్నారు. రామచంద్రపురం శాసన సభ్యులు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ బ్యాంకు రుణాల ద్వారా పేదల స్థితిగతులు మెరుగుపడేలా ఉండాలని, రుణాల మంజూరు, వాటి వినియోగం పై సమీక్షించడానికి నియోజకవర్గ స్థాయి బ్యాంకర్ల సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. మండపేట శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ మండపేటలో నిర్మించిన పట్టణ గృహ నిర్మాణం లబ్దిదారులకు రుణ సహాయం పై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఎల్.డి.యం. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత సంవత్సరం జిల్లాలో 19,347 కోట్లు రుణ ప్రణాళిక లక్ష్యంకాగా 19,031 కోట్ల రుణ సౌకర్యం అందించి 98 శాతం ఫలితాలు సాధించామని అన్నారు.

ఈ సమావేశంలో శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు, శాసన సభ్యులు కొండేటి చిట్టిబాబు, ఆంధ్రాబ్యాంక్ జోనల్ మేనేజర్ ఎవిఎస్ రామ్మోహన్ రావు, రిజర్వ్ బ్యాంక్ ఎజియం ఫణిరాజు, జేసి-2 సిహెచ్.సత్తిబాబు, డిఆర్‌ఓ యం.వి.గోవిందరాజులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

( సమాచార శాఖ చే జారీ )